
సాక్షి పల్నాడు

గురువారం । 20 । మార్చి । 2025



నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి బుధవారం గుంటూరు గోరంట్లకు చెందిన వాసా భాస్కరరావు రూ.లక్ష విరాళం సమర్పించారు.



సాగర్ నీటి మట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 518.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పొగాకు బోర్డు ఈడీగా విశ్వశ్రీ



కొరిటెపాడు : భారత పొగాకు బోర్డు నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బి.విశ్వశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది, పలువురు వ్యాపారులు, రైతులు కలిసి అభినందనలు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
నరసరావుపేట	6.26	4.57
గుంటూరు	6.24	4.55
బాపట్ల	6.24	4.55

బీమా ధీమా కరువు

- టీడీపీ మేనిఫెస్టోలో ఆర్భాటంగా ప్రకటన
- అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఊసే లేదు
- సాయం అందక ఇబ్బంది పడుతున్న ట్రాక్టర్ ప్రమాదంలో మృతుల కుటుంబాలు
- సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం ప్రకటించినా అందని నిధులు
- సరైన పత్రాలు లేవని సీఎంఆర్ఎఫ్ తిరస్కరణ
- బీమా పథకం అమలులో ఉంటే మేలు జరిగేదంటున్న బాధితులు
- గత ప్రభుత్వంలో పటిష్టంగా పథకం అమలు



టీడీపీ, జనసేనలు ప్రజాగళం పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ

సాక్షి, నరసరావుపేట: అధికారంలోకి రావడానికి హామీలివ్వడం, గద్దెనెక్కిన తరువాత వాటిని అమలు చేయకపోవడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రన్న బీమా పరిహారం పెంచి అమలు చేస్తామని పొందుపర్చారు. ప్రచార సభలో హోరెత్తించారు. తీరా అధికారం చేపట్టి పది నెలలైనా దాని ఊసే లేదు. ఎప్పటి నుంచి అమలు చేస్తున్నారో కూడా స్పష్టం చేయకపోవడం దురదృష్టకరం. దీంతో కుటుంబాలను పోషిస్తున్న వ్యక్తులు అర్థంతరంగా మరణిస్తే పరిస్థితి దారుణంగా మారుతోంది. కుటుంబ అవసరాలు తీరక అప్పుల పాలవుతున్నారు. కష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ బీమా పరిహారం బాధిత కుటుంబాలకు అందితే ఉపశమనం లభించేది. కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులు, పెళ్లిళ్లకు ఆటంకం కలిగేది కాదు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతో ఎంతో కీలకమైన పథకాలను సైతం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది.

రూ.10 లక్షల ఇస్తామంటూ ప్రచారం

చంద్రన్న బీమా పథకం ద్వారా సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు అందజేస్తామని కూటమి నేతలు మేనిఫెస్టోలో పొందుపర్చారు. అధికారంలోకి రావడంతో అప్పటి వరకు ఉన్న వైఎస్సార్ బీమా పథకాన్ని మే 31నుంచి ఆపివేశారు. అప్పటి నుంచి నేటి వరకు జిల్లాలో కుటుంబాలను పోషిస్తున్న వందలాది మంది మరణించారు. ఇటీవల జిల్లాలో కూలీలు వ్యవసాయ పనుల కోసం ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించే సమయంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన ఘటనలు అనేకం. రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవసాయ కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. ప్రభుత్వం చంద్రన్న బీమా అమలులోకి తెచ్చిఉంటే, ప్రతి కుటుంబానికీ రూ.10 లక్షల సాయం అందేది. దీంతో ఆయా కుటుంబాలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించేది. విషాదకర ఘటనలలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చినా అమలు కావడంలేదని బాధితులు వాపోతున్నారు.

సాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు

ముప్పాళ్ల మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన నలుగురు వ్యవసాయ కూలీలు ఫిబ్రవరి 9న సాయంత్రం మిరప కోతలకు వెళ్లి ట్రాక్టర్‌పై తిరిగి వస్తూ ప్రమాదంలో మృతి చెందారు. తక్షణ సాయంగా జిల్లా కలెక్టర్ ఒక్కో కుటుంబానికి రూ.25వేలు అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, కలెక్టర్ అరుణ్‌బాబు హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆయా కుటుంబాలకు సాయం అందలేదు. సీఎం రిలీఫ్ ఫండ్ ఫైల్ సాంకేతిక కారణాలతో వెనక్కి వచ్చిందని స్థానిక అధికారులు చెబుతున్నారు. గత సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో బాధిత కుటుంబాలు నష్టపరిహారం అందివ్వాలని కోరాయి. బీమా పథకం అమలులో ఉంటే ప్రతి కుటుంబానికీ హక్కుగా రూ.10 లక్షలు దక్కేదని బాధితులు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా పథకం లబ్ధిదారులు మరణించిన వెంటనే గంటల వ్యవధిలో సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వెళ్లి పేరు నమోదు చేసుకొని, మట్టి ఖర్చుల నగదు అందజేసేవారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.



చాగంటివారిపాలెంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదం (ఫైల్)

పట్టించుకోవడం లేదు



ప్రమాదం జరిగిన తర్వాత అందరూ వచ్చారు. రూ.25 వేలు ఇచ్చి వెళ్లారు. ఆ తర్వాత మా గురించి పట్టించుకున్న వారే లేరు. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. కనీసం ప్రమాద బీమా సాయం ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. బీమా పథకం అమలులో లేదని స్థానిక ప్రభుత్వ ఉద్యోగులు చెబుతున్నారు.

–మధిర వెంకటేశ్వరరెడ్డి,
మృతురాలు మధిర గంగమ్మ కుమారుడు, చాగంటివారిపాలెం

గుండె తరుక్కు పోతోంది



ట్రాక్టర్ ప్రమాదంలో భార్య చనిపోయిన దగ్గర నుంచి పిల్లల ఆలనాపాలనా చూసేవారే కరువయ్యారు. ఆ సంఘటన తలుచుకుంటేనే గుండె తరుక్కుపోతోంది. ఇద్దరి పిల్లలు బాగోగులు నేనే చూసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ సాయం ఇంత వరకూ అందలేదు. ఆ రోజు ఇచ్చిన రూ25 వేలు తప్పా మరలా మా గురించి ఆలోచించిన వారే లేరు.

–చెక్కెర సుధాకరరెడ్డి,
మృతురాలు చెక్కెర మాధవి భర్త, చాగంటివారిపాలెం

లక్ష వరకు ఖర్చు



ట్రాక్టర్ ప్రమాదంలో భార్యను కోల్పోయా. పెళ్లీడు కొచ్చిన పిల్లలున్నారు. చనిపోయినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అయింది. అప్పు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం వెంటనే సాయం అందించి ఆదుకోవాలి. సీఎం రిలీఫ్ ఫండ్ ఫైల్ సాంకేతిక సమస్యతో వెనక్కి వచ్చింది.

– తేనేపల్లి శ్రీనివాసాచారి,
మృతురాలు తేనేపల్లి పద్మావతి భర్త, చాగంటి వారిపాలెం.

నిర్ణీత గడువులోగా రీ సర్వే పూర్తిచేయాలి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- మండలంలోని పలుచోట్ల పరిశీలన



కండ్లకుంటలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

నకరికల్లు: భూముల రీసర్వేను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మండలంలోని కండ్లకుంటలో సర్వేను ఆయన బుధవారం పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి, సర్వే జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులతో మాట్లాడారు. రీసర్వేపై ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే సత్వరమే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తొలుత స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రాథమిక సేవలు, విద్యుత్ తదితర మౌలిక వసతులు తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. అనంతరం చల్లగుండ్లలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉదయం 6గంటల నుంచి 11గంటలలోపే పనులను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలతో మాట్లాడారు. సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పని ప్రదేశాల్లో టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. పొలాల్లో చెరువులను తవ్వుకుంటున్న రైతులతో మాట్లాడి, పలు సూచనలు ఇచ్చారు. ఈ–శ్రమ కార్డ్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్వే అండ్ రికార్డ్స్ అధికారి మధుకీర్తి, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, డీఈఓ చంద్రకళ, పలు శాఖల అధికారులు ఉన్నారు.

న్యూస్‌రీల్

డీఆర్‌డీఏ పీడీగా ఝాన్సీరాణి బాధ్యతల స్వీకరణ




నరసరావుపేట: జిల్లా డీఆర్‌డీఏ పీడీగా ఝాన్సీరాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఒంగోలు జిల్లాలో విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన బాలూనాయక్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల మేరకు ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.

గేట్‌లో జశ్వంత్ భవానీకి 6వ ర్యాంక్



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్–2025 పరీక్షా ఫలితాలలో పట్టణానికి చెందిన పెంటేల జశ్వంత్ భవాని 6వ ర్యాంక్ సాధించాడు. జశ్వంత్ భవాని తండ్రి రాజశేఖర్ న్యాయవాదిగా పని చేస్తున్నారు. ముంబైలో 5జీ సిస్టమ్ ఇంజనీర్‌గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి గేట్ పరీక్షలకు జశ్వంత్ సిద్ధం అయ్యాడు. అందరి అంచనాలను నిజం చేస్తూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించాడు. దేశవ్యాప్తంగా దాదాపు 8 లక్షల మందికి పైగా పరీక్ష రాశారు. ఇందులో దాదాపు లక్ష మంది అభ్యర్థులు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో పరీక్ష రాశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జశ్వంత్ భవాని 6వ ర్యాంక్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని పలువురు అభినందనలు తెలియజేశారు.

1,27,005 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,27,005 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,24,077 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 66,903 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులను వేధిస్తున్న ప్రభుత్వం

మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డి



మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి

చిలకలూరిపేట: రాజకీయ అరాచకాలకు పరాకాష్ట కూటమి ప్రభుత్వ పాలన అని... న్యాయ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని మాజీ అదనపు అడ్వకేట్ జనరల్, వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకరరెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి పరిపాలనపై, పేదలపై ప్రేమ లేదని, కేవలం రాజ్య హింసను మాత్రమే ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా యాక్టివిస్టు దొడ్డా రాకేష్‌గాంధీ కేసు విచారణ నిమిత్తం చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బుధవారం ఆయన హాజరయ్యారు. మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం, ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యాన్ని విడిచిపెట్టి ప్రభుత్వం కేవలం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయించడంలో పురోగతి సాధించిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోరితే రాష్ట్ర డీజీపీ అపాయింట్‌మెంట్ ఇవ్వరని, టీడీపీ వారు పెట్టిన పోస్టులపై ఫిర్యాదు చేస్తే ఏ మాత్రం కేసులు నమోదు చేయరని ఆరోపించారు. అదే టీడీపీకి చెందిన వారు ఫిర్యాదు చేయడం ఆలస్యం, ఇచ్చాపురం నుంచి అనంతపురం వరకు రాష్ట్రం నలుమూలల కేసులు నమోదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న అరాచక వైఖరిని మర్చిపోమని, చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న పోలీసు అధికారులను న్యాయ స్థానాల ముందు నిలబెట్టి తీరుతామని హెచ్చరించారు. జర్మనీలో హిట్లర్ పరిపాలన కాలంలో ముందుగా యూదులను వేధించారని, తమను కాదని కమ్యూనిస్టులు మౌనంగా ఉన్నారన్నారు. అనంతరం కమ్యూనిస్టులను, సోషలిస్టులను కూడా వేధించారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్న ప్రభుత్వం తదుపరి సమస్యలపై ప్రశ్నించే ప్రతి గొంతుకను వేధించటం ఖాయమన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని తెలిపారు.

అన్నీ తప్పుడు కేసులే !

ప్రస్తుతం కేసులు బనాయించి వేధిస్తున్న దొడ్డా రాకేష్ గాంధీ కేసులో పేర్కొన్న ఆరో తేదీ రాత్రి 9గంటలకు గుంటూరులోని శ్యామలానగర్‌లో ఉన్నట్లు సీసీ టీవీ ఫుటేజీలు ఉన్నాయని, అవి న్యాయస్థానంలో అందజేశామని తెలిపారు. ఇదే కేసులో ముద్దాయిగా ఉన్న ఫణీంద్ర అదే సమయంలో గుంటూరులోని ఓ సెలూన్‌లో ఉండగా, మరో ముద్దాయి రామకోటేశ్వరరావు హైదరాబాద్‌లో ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని వివరించారు. ఇలాంటి తప్పుడు కేసుల్లో పోలీసుల తరుపున డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ స్థాయి న్యాయాధికారి హాజరుకావడం వెనుక ప్రభుత్వ ఉద్దేశాలు వేరే ఉన్నాయని సుధాకరరెడ్డి పేర్కొన్నారు. రాకేష్‌గాంధీని కస్టడీకి తీసుకొని తమకు అనుకూలంగా వాంగ్మూలం ఇప్పించుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. భారతదేశంలో పోలీసుల ముందు ఇచ్చిన వాగ్మూలానికి చట్టబద్ధత ఉండదని తెలిపారు. బీసీ మహిళ అయిన మాజీ మంత్రి విడదల రజినీని కేసులో ఇరికించి వేధించేందుకే పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను న్యాయపరంగా ఆదుకొనేందుకు, అరాచకాలను అడ్డుకొనేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

సుదీర్ఘ వాదనలు

రాకేష్‌గాంధీకి బెయిల్ మంజూరు చేయాలని మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. అతనిని పోలీసు కస్టడీకి అప్పగించాలని డీడీవోపీ బర్కత్ అలిఖాన్ పోలీసుల తరపున వాదించారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి గురువారం ఆర్డర్లు జారీ చేస్తామని వెల్లడించారు.

అడ్డదారిలో తగ్గేదేలే !

- సరిహద్దు దాటుతున్న గ్రానైట్, ఇసుక
- గురజాల వయా శ్రీనివాసపురం మీదుగా రవాణా
- లారీలను దాటించి సొమ్ము చేసుకుంటున్న కూటమి నేతలు
- ఒక్కో లారీకి రూ.40వేలకు పైగా వసూలు
- రోజుకి 50 లారీలకు పైగా రవాణా
- ఎస్కార్ట్ వాహనాలతో ఓ గ్యాంగ్ పహరా
- ప్రభుత్వ ఆదాయానికి గండి



అక్రమంగా సరిహద్దు దాటుతున్న గ్రానైట్ లారీలను స్వాధీనం చేసుకున్న దృశ్యం(ఫైల్)

సాక్షి , టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అక్రమార్కులకు వరంగా మారింది. అడ్డదారిలో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రభుత్వానికి రాయల్టీలు చెల్లించకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందులో కూటమి నేతలు కూడా భాగస్వాములుగా చేరి బరితెగిస్తున్నారు. అడ్డ'దారి'లో తగ్గేదేలే ! అంటూ విర్రవీగుతున్నారు. తమను అడ్డుకునేదెవరూ అంటూ రెచ్చిపోతున్నారు. ప్రకాశం జిల్లా నుంచి వచ్చే గ్రానైట్ లారీలను రాష్ట్ర సరిహద్దు దాటిస్తూ లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టల మీదుగా రోజుకి 50కి పైగా లారీలు దాటిపోతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కూటమి నేతల జేబుల్లోకి చేరుతోంది.

సరిహద్దు దాటించేందుకు భారీ వసూళ్లు

ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి, మార్టూరు ప్రాంతాల్లో గ్రానైట్ పుష్కలంగా ఉంది. లారీల ద్వారా తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాలకు అక్రమార్కులు తరలిస్తున్నారు. జాతీయ రహదారులపై అధికారులు తనిఖీలు చేసే సమయంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో దాటేలా స్కెచ్ వేశారు. చీమకుర్తి, మార్టూరు ప్రాంతాల్లో లారీ బయలుదేరగానే సరిహద్దు దాటించే అక్రమార్కులకు ముందుగానే సమాచారం అందిస్తారు. గురజాలకు గ్రానైట్ లారీ వచ్చిన తరువాత అక్కడే బేరం కుదుర్చుకుంటారు. ఒక్కో లారీకి రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తారు. కూటమి నేతలు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి ఈ దందాకు పాల్పడుతున్నారు. వీళ్ల కళ్లుగప్పి గ్రానైట్ లారీ సరిహద్దు దాటితే వెంటబడి, బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడతారు. మామూళ్లు ఇవ్వకపోతే అధికారులకు వీరే ఫోన్లు చేసి పట్టిస్తారు.



రాష్ట్ర సరిహద్దు దాటేందుకు శ్రీనివాసపురం మీదుగా వెళ్లుతున్న గ్రానైట్ లారీ

గురజాలలో బేరసారాలు

అక్రమాలకు పాల్పడే వారు సైతం ఎస్కార్ట్ వాహనాలను ఉపయోగిస్తున్నారు. సాధారణంగా పోలీసులు, మంత్రుల వాహనాలకు పోలీస్ సైరన్లు ఉంటాయి. కానీ గ్రానైట్ వాహనాలను సరిహద్దు దాటించే అక్రమార్కుల వాహనాలకు ఈ సైరన్లు అమర్చుకున్నారు. చీమకుర్తి, మార్టూరు నుంచి గ్రానైట్ వాహనాలు నకరికల్లు మీదుగా కారంపూడి అక్కడ నుంచి గురజాలకు వస్తాయి. అక్రమార్కులు వాహనం వద్దకు వెళ్లి బేరాలు మాట్లాడుకుని గురజాల నుంచి పులిపాడు, శ్రీనివాసపురం, పొందుగల మీదుగా రాష్ట్ర సరిహద్దు దాటిస్తారు. గ్రానైట్ వాహనాలకు ముందుగా కార్లలో, ద్విచక్ర వాహనాల్లో వెళతారు. అధికారులు ఉన్నారా..లేదా ? అని ఆరా తీస్తారు. కిందిస్థాయి సిబ్బంది ఉంటే కొంత ముట్టజెప్పి సరిహద్దు దాటిస్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటువంటి అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఒకవేళ లారీలను మైనింగ్, వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఆపితే బెదిరింపులకు పాల్పడుతున్నారు.

ఇసుక లారీలు రైట్ రైట్

ఇసుక లారీలుసైత సరిహద్దులు దాటిపోతున్నాయి. అచ్చంపేట, క్రోసూరు రీచ్‌ల నుంచి కూటమి సైన్యమే సరిహద్దు దాటిస్తోంది. ఒక్కో లారీకి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. రోజుకి 40కిపైగా ఇసుక లారీలు అక్రమంగా సరిహద్దు దాటుతున్నాయి. ఇటీవల అధికారులు దాడులు చేసి గ్రానైట్, ఇసుక లారీలను పట్టుకున్నారు. పెనాల్టీలు చెల్లించిన తరువాత వదిలేయడం గమనార్హం



రాత్రి సమయంలో అక్రమంగా సరిహద్దు దాటుతున్న ఇసుక లారీ

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

- పని ఒత్తిడే కారణమంటూ సూసైడ్ నోట్
- నాలుగు నెలల క్రితమే వివాహం



నరసరావుపేటటౌన్: తీవ్ర పని ఒత్తిడితో ఉద్యోగం చేయలేక పోతున్నా.. వద్దు అంటే పెళ్లి చేశారు.. ఇప్పుడు ఉద్యోగం మానేస్తే భార్య తరపు బంధువుల నుంచి మాట వస్తుంది.. ఒత్తిడి తట్టుకోలేక లోకం విడిచి వెళ్తున్నా..అమ్మా నాన్న నన్ను క్షమించండి ! అంటూ నాలుగు నెలల క్రితం వివాహం అయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం గుడిపాడుకు చెందిన బండ్ల హనుమంతరావు (29) కు నరసరావుపేట మండలం పమిడిమర్రుకు చెందిన సౌజన్యతో నాలుగు నెలల కిందట వివాహం అయ్యింది. హనుమంతరావు రెండేళ్ల నుంచి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. పని ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల సెలవుపై వచ్చి స్వగ్రామంలో ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పెద్దలు అతనికి నచ్చ చెప్పారు. కొన్ని రోజులు బాగానే ఉండి రెండ్రోజుల కిందట భార్యను పుట్టింట్లో వదిలి నరసరావుపేట బస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. సోమవారం నుంచి అతను గది బయటకు రాకపోవడాన్ని గమనించిన లాడ్జి సిబ్బంది మంగళవారం రాత్రి తలుపు బద్దలకొట్టి చూడగా ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ సీహెచ్ విజయ్ చరణ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ఆత్మహత్యకు వివిధ మార్గాల్లో ప్రయత్నం

బండ్ల హనుమంతరావు ఎలాగైనా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న తర్వాత పలు రకాలుగా ప్రయత్నం చేసి విఫలమై చివరకు ఉరివేసుకొని మృతి చెందినట్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు భావిస్తున్నారు. కత్తితో మెడ కోసుకునేందుకు మొదట ప్రయత్నం చేశాడు. మృతుడి మెడ భాగంలో ఉన్న గాట్లను పరిశీలించిన పోలీసులు అక్కడ ఉన్న కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు.

పురుగు మందు తాగిన భార్య

భర్త ఆత్మహత్య విషయం తెలుసుకున్నయ సౌజన్య క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పుకొస్తున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- జిల్లాలో 99శాతం విద్యార్థుల హాజరు
- పరీక్షల నిర్వహణను పరిశీలించిన అధికారులు



నకరికల్లులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం హిందీ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని 128 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 25,607మందికి గాను 25,373మంది, ప్రైవేటు విద్యార్థులు 78మంది హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. విద్యార్థుల హాజరు 99శాతంగా నమోదైనట్టు ఆమె వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు నియమించిన 22 సిట్టింగ్, 13 ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను సందర్శించినట్టు తెలిపారు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదవ తరగతి దూరవిద్య ఇంగ్లిష్ పరీక్షకు జిల్లాలోని 27 కేంద్రాల్లో 1,118మందికి గాను 977మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు నకరికల్లు జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ నకరికల్లు, కారంపూడిలోని నాలుగు కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కె.వి.శ్రీనివాసులరెడ్డి సత్తెనపల్లి డివిజన్‌లోని ఆరు కేంద్రాలు, దూరవిద్య డైరెక్టర్ ఆర్.నరసింహారావు పట్టణంలోని ఐదు కేంద్రాలు, జాయింట్ డైరెక్టర్ ఎస్.గీత వినుకొండలోని 11 కేంద్రాలు, రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఎస్.అక్బర్ అలీ గురజాలలోని రెండు కేంద్రాలను తనిఖీ చేశారు.

జాతీయ రహదారిపై లిక్కర్ లారీ బోల్తా



యద్దనపూడి: జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి లిక్కర్ లారీ బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి మద్యం లోడుతో సామర్లకోట వెళుతున్న లారీని రోడ్డు పక్కగా ఆపి డ్రైవర్ నిద్ర పోతున్నాడు. ఈ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ లిక్కర్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లిక్కర్ లారీ సర్వీస్ రోడ్డుపై పడిపోగా, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మద్యం సీసాలు పగిలి రోడ్డుపై పడిపోయాయి. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని లీకేజీని పరిశీలించారు. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించి, లారీ తొలగించే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం



ప్రిన్సిపాల్ సరోజిని

విజయపురిసౌత్: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సరోజిని తెలిపారు. ఆమె కళాశాలలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ కల్లా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ చేరడానికి ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5గంటల వరకు 26 కేంద్రాల్లో ప్రవేశపరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఫీజు రూ. 300ను ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాలని తెలిపారు. గురుకుల, జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు ఉచిత హాస్టల్ వసతి, నోట్, టెక్స్ట్ బుక్స్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు జేఈఈ మెయిన్స్, నీట్, సీఏ(సీపీటీ) కోచింగ్ ఇస్తామని తెలిపారు. నోటిఫికేషన్, పూర్తి వివరాల కోసం www.aprrapcfrr.in వెబ్‌సైట్‌లో చూడాలని ఆమె సూచించారు. అర్హత గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

జూట్ ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



రాజుపాలెం: జూట్ ఉత్పత్తుల తయారీలో శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి. బబిత తెలిపారు. మండలంలోని కొండమోడు మండల పరిషత్ పాఠశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం ఆధ్వర్యంలో మహిళలకు జూట్ ఉత్పత్తుల తయారీలో శిక్షణను బుధవారం ప్రారంభించారు. డైరెక్టర్ బబిత మాట్లాడుతూ నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గ్రామంలోని ముస్లిం మహిళలకు జూట్ ఉత్పత్తుల శిక్షణను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ప్రోగ్రాం అధికారి మందూరి వెంకటరమణ, శిక్షకురాలు పి.దుర్గ, కె.ఎస్.ఆర్. విద్యా సంస్థల డైరెక్టర్స్ కోనేటి నరసింహారావు, బాడిసె మస్తాన్‌రావు పాల్గొన్నారు. మొదటి రోజు శిక్షణకు 50 మంది మహిళలు హాజరయ్యారు.


సాగు నీటి కోసం రోడ్డెక్కిన రైతన్న

పది రోజులుగా ఎండిపోతున్న పంటలు



దొడ్లేరులో ధర్నా చేస్తున్న రైతులు

దొడ్లేరు(క్రోసూరు): సాగర్ నీళ్లు విడుదల కాక, వదిలినా దిగువ పొలాలకు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం దొడ్లేరులో రైతులు ధర్నా చేపట్టారు. రబీలో దాళ్వా వరి సాగు చేస్తున్న వారంతా నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలువల్లో చుక్క నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. క్రోసూరు మండలం దొడ్లేరు పరిధిలోని కస్తల మైనర్ కింద 500 హెక్టార్ల ఆయకట్టు ఉంది. దీనికి నాగార్జున సాగర్ కాలువ నుంచి నీళ్లు విడుదల చేస్తారు. అవి ఎర్రబాలెం మేజర్ దాటుకుని, చింతపల్లి మేజర్‌కు వెళ్లే మార్గంలో దొడ్లేరులోని కస్తల మైనర్‌కు రావాలి. అయితే, నీళ్లందక కస్తల మైనర్ డ్రాప్ కూడా ఎండిపోయింది. పొలాలకు నీళ్లు వచ్చే దిక్కే లేదు. దీనిపై కెనాల్స్ ఏఈ బండి శ్రీనివాసరావును వివరణ కోరగా 500 క్యూసెక్కులకు గానూ ప్రస్తుతం 350 మాత్రమే సరఫరా అవుతున్నాయని తెలిపారు. వారాబందీ పద్ధతిలో నీళ్లు ఇస్తున్నామని చెప్పారు. నాలుగు రోజులు ఎర్రబాలెం మేజర్‌కు, తర్వాత నాలుగు రోజులు కస్తల మైనర్‌కు వదులుతామని తెలిపారు. గురువారం దొడ్లేరు పొలాలకు విడుదల చేస్తామని వెల్లడించారు.



చుక్క లేని కస్తల మైనర్

పంటలను కాపాడండి



నేను పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. కాలువ నీళ్లు రాకపోవడంతో కళ్ల ఎదుటే పంట ఎండి పోతోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.
–షేక్ బాషా, దొడ్లేరు

నీరు అందడం లేదు

కాలువకు నీళ్లు విడుదల చేయడం లేదు. చేసినా కింద పొలాలకు అందడం లేదు. ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. పంటలు ఎండిపోతున్నాయి.
– షేక్ కరీమూన్, దొడ్లేరు

గేట్‌లో హేమంత్‌కు 25వ ర్యాంకు



నూజెండ్ల: గేట్–2025 పరీక్ష ఫలితాల్లో ఘంటా హేమంత్ 25వ ర్యాంకు సాధించాడు. ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. అతడు ప్రస్తుతం చెన్నై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తల్లిదండ్రులైన ఘంటా నాగేశ్వరరావు, సుజాత దంపతులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మైక్రోసాఫ్ట్‌కు ఎంపికయ్యాడు. గేట్ ర్యాంకు ద్వారా ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో హేమంత్ పీజీ చేయటానికి అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందుతూ చదువుకునే అవకాశాలు ఉంటాయని నాగేశ్వరరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నుంచి ముగ్గురు సస్పెన్షన్

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గంలో పలువురు పార్టీ నాయకులను సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులపై పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫార్సుల మేరకు ఈపూరు అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఈపూరు మండల నాయకులు శాఖమూరి బుచ్చయ్య చౌదరి, నూజెండ్ల మాజీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డిలను సస్పెండ్ చేస్తూ పార్టీ అధ్యక్షులు నిర్ణయం తీసుకున్నారు.

సాయి సాధన చిట్ ఫండ్ కేసు గుంటూరుకు బదిలీ

నరసరావుపేటటౌన్: సాయి సాధన చిట్ ఫండ్‌స్కాం కేసు గుంటూరు సీఐడీ కోర్టుకు బదిలీ అయ్యింది. సుమారు 600 మంది చిట్స్ సభ్యులు, డిపాజిట్ దారులను భారీస్థాయిలో మోసగించినట్లు పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి ఫిర్యాదుతో నెల కిందట వన్‌టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇందులో గ్రావిటీని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం సీఐడీకి అప్పగించడంతో పాటు కొన్ని ప్రత్యేక చట్టాలను కూడా జత పరిచింది. దీంతో కేసును సీఐడీ కేసుల విచారణ కోర్టు అయిన గుంటూరు ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేయాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో బుధవారం గుంటూరు సీఐడీ కోర్టుకు కేసును బదిలీ చేశారు. దీంతోపాటు 13వ అదనపు జిల్లా కోర్టులో పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా గుంటూరు జిల్లా ప్రధాన న్యాయస్థానానికి బదిలీ అయింది. కాగా పాలడుగు పుల్లారావుతో పాటు చిట్‌ఫండ్‌లో భాగస్వాములుగా ఉన్న ఆయన భార్య వాణిశ్రీ , కుమారుడు పవన్ కుమార్, కుమార్తె శ్రీహర్షవర్ధిని, అల్లుడు, ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ నూకవరపు రాజా రమేష్, నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గాలి కోటయ్యలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. పుల్లారావు ఇప్పటికే కోర్టులో లొంగిపోయి జైల్లో ఉండగా, మిగిలిన వారు పరారీలో ఉండి, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్న విషయం విదితమే.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



దాచేపల్లి : మండలంలోని పొందుగల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు 35 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడంతో శరీరం నుంచి తల వేరు అయింది. శరీరంపై నలుపు రంగు బనియన్, ప్యాంట్ ఉంది. సంఘటన స్థలాన్ని జీఆర్పీ ఏఎస్ఐ వెంకట్రామయ్య, కానిస్టేబుల్ రామరాజు పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలకు 9440438256, 9949063960 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జలాల్‌పురంలో ఆధ్యాత్మిక శోభ



విద్యుత్ దీపాలతో పునీత జోజప్ప దేవాలయం

- భక్తిశ్రద్ధలతో పునీత జోజప్ప మహోత్సవం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు
- ఆకట్టుకున్న సాంఘిక నాటిక

పెదకూరపాడు: మండలంలోని జలాల్‌పురంలో బుధవారం పునీత జోజప్ప దేవాలయ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాటిబండ్ల విచారణ గురువులు రెవరెండ్ హృదయకుమార్, సహాయక గురువులు సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్య పూజ బలిని నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి హృదయకుమార్, సురేష్ మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరూ సిలువ మార్గంలో నడవాలని కోరారు. తోటి వారికి సాయం చేస్తూ క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని కోరారు. పునీత జోజప్ప మానవాళికి మార్గదర్శమని తెలిపారు. పలువురు గురువులు మహోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు పునీత జోజప్ప మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాల ఏసు యువజన నాట్యమండలి కళాకారులు ప్రత్యేక నాటికలను ప్రదర్శించారు. రాత్రి భారీ బాణసంచా కాల్చుతూ, మేళతాళాలతో గ్రామంలో తేరు ఊరేగింపు నిర్వహించారు.



దివ్యపూజ బలి నిర్వహిస్తున్న గురువులు



ఉత్సవానికి హాజరైన భక్తులు

సాగర్ ఎర్త్‌డ్యాం కింద అగ్నికీలలు

- నాలుగు గంటల శ్రమ అనంతరం అదుపులోకి వచ్చిన మంటలు
- కాలిపోయిన సీసీ కెమెరాల కేబుల్‌వైర్లు
- అగ్నికి ఆహుతైన విద్యుత్ కేబుల్



ఉవ్వెత్తున లేచిన అగ్నికీలలు

విజయపురి సౌత్: సాగర్ ప్రధాన డ్యాం ఎడమ వైపున గల ఎర్త్‌డ్యాం కింద బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచాయి. ఎండిన కార్పె గ్రాస్‌కు అంటుకోవడంతో అగ్నికీలలు ఉవ్వెత్తున లేచాయి. దిగువనే ఉన్న శివం పార్కులో ఎండిన గడ్డి ఉండటంతో దానికి మంటలు అంటుకుని గాలి వాటానికి కిలోమీటరు మేర తగలబడింది. మెయిన్ డ్యాంకు సమీపంలో వ్యూ పాయింట్ దగ్గర విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బంది అధికారులను అలర్ట్ చేశారు. మెయిన్ డ్యాం ముఖ ద్వారం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది, జెన్‌కో, సాగునీటి శాఖ సిబ్బంది అష్టకష్టాలు పడ్డారు. ఈలోపు ఫైర్ ఇంజన్ వచ్చింది. నాలుగు గంటల శ్రమ అనంతరం ఎట్టకేలకు మంటలను ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. ఎర్త్ డ్యాంపై గల విద్యుత్ కేబుల్స్, సీసీ కెమెరాల కేబుల్స్ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రాత్రి కావడంతో ఎంతమేరకు నష్టం జరిగింది తెలియడం లేదని డ్యాం ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం అంచనా వేస్తామని వెల్లడించారు.

24న ఎయిడెడ్ స్కూల్లో పోస్టుల భర్తీకి కంప్యూటర్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఎయిడెడ్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈనెల 24న నిర్దేశిత కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత టెస్టు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సంబంధించిన హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సమాచారాన్ని తదుపరి తెలియపరుస్తామని పేర్కొన్నారు.

పత్తి వ్యాపారి ఆత్మహత్య



ప్రత్తిపాడు: పత్తి వ్యాపారి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కాసు నాగిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ పదేళ్లుగా పత్తి కమీషన్ వ్యాపారం చేస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా బామిని మండలం దమ్మిడిజోలా గ్రామ పరిధిలోని రైతుల దగ్గర పత్తిని కమీషన్ పద్ధతిన బొమ్మా కొండారెడ్డి అనే అతనికి ఇప్పిస్తుంటాడు. అయితే ఆ పత్తికి సంబంధించిన డబ్బులు, కమీషన్ కలిపి నాగిరెడ్డికి రూ.43 లక్షలు కొండారెడ్డి ఇవ్వాల్సి ఉంది.కొంత కాలంగా రైతులు డబ్బులు అడుగుతున్నారని, వారికి సమాధానం చెప్పలేకపోతున్నానని, రైతుల పత్తికి సంబంధించిన డబ్బులు ఇవ్వాలని కొండారెడ్డిని నాగిరెడ్డి అడుగుతున్నాడు. దీంతో తన దగ్గర డబ్బులు లేవని, పదే పదే డబ్బులు అడిగితే కోర్టులో కేసు వేస్తానని కొండారెడ్డితోపాటు ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి నాగిరెడ్డిని బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక మంగళవారం గ్రామంలోని సాగర్ కాలువ వద్ద ఉన్న సమాధుల వద్ద పురుగు మందు తాగి నాగిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు విషయాన్ని అతని భార్య రాజ్యలక్ష్మికి తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ కె.నాగేంద్ర బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.